సాక్షి ప్రకాశం

శనివారం । 24 । ఆగస్టు । 2024



టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం
టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకమని మంత్రి డోల బాలశ్రీ వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పించారు. - 8లో..



సమస్యల రొద.. రోగుల వ్యథ
మార్కాపురంలోని జీజీహెచ్‌లో రోగులను సమస్యలు వెక్కిరిస్తున్నాయి. చినుకుపడితే ఆస్పత్రి ప్రాంగణమంతా బురదగా మారుతోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం 33/28

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైన వారు కొందరి బ్యాంకు ఖాతాలకు ఉపకార వేతనం జమకాలేదని, అందుకు కారణం వారి బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ అనుసంధానం కాకపోవడమే అని జిల్లా విద్యాశాఖ అధికారి బి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికై ప్రస్తుతం 9, 10, 11, 12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నా/రెన్యువల్ చేసుకున్నా విద్యార్థి ఆధార్ బ్యాంకు ఖాతాకు అనుసంధానం కాకపోవడంతో ఉపకార వేతనం జమకాలేదన్నారు. ఈనెలాఖరులోగా బ్యాంకు ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

డిప్యూటీ తహశీల్దార్లకు పదోన్నతులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో పలువురు డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన తహశీల్దార్లకు పోస్టింగ్ కేటాయించారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న పీ మురళిని కొండపి తహశీల్దారుగా నియమించారు. అదేవిధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా ఉన్న జీ ఆంజనేయులును టంగుటూరు తహశీల్దారుగా, పొదిలిలో రీసర్వే డీటీగా ఉన్న కే శాంతిని దోర్నాల తహశీల్దారుగా, వెలిగండ్ల డీటీ సీహెచ్ నాగార్జునరెడ్డిని మార్కాపురం కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దారుగా, కందుకూరు డీటీ బీ జనార్దన్‌ను జరుగుమల్లి తహశీల్దారుగా, మార్కాపురం ఎలక్షన్ డీటీ డీ భాగ్యలక్ష్మిని కొమరోలు తహశీల్దారుగా, చీమకుర్తి డీటీ బీ సత్యసాయి శ్రీనివాసరావును కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్‌గా, యర్రగొండపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఏ జితేంద్రకుమార్‌ను బేస్తవారిపేట తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా కలెక్టరేట్ మెజిస్టీరియల్ సూపరింటెండెంట్‌గా ఉన్న టీ రవిని సింగరాయకొండ తహశీల్దారుగా, దోర్నాల తహశీల్దారుగా ఉన్న పీ బాలాజి విశ్వనాథ్‌ను కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఏఓగా, మార్కాపురం కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దారుగా ఉన్న కే దాసును అర్ధవీడు తహశీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్దుబాటు ప్రక్రియలో అక్రమాలు

- తక్షణమే రద్దుచేయాలని ఏపీటీఎఫ్ డిమాండ్

ఒంగోలు: సర్దుబాటు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన కనిగిరి మండల విద్యాశాఖ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా జనార్ధన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పక్షపాత ధోరణితో విద్యాశాఖ అధికారులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, సోషల్ స్టడీస్ విభాగంలో నలుగురు ఉపాధ్యాయులకు అవకాశం ఉందన్నారు. సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వకుండా జూనియర్లకు విద్యాశాఖ అధికారులే పాఠశాలలో బదిలీ అవకాశం కల్పించడం సరికాదన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే అక్రమంగా జరిపిన సర్దుబాటు ప్రక్రియను రద్దుచేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కనిగిరి ఎంఈవోపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారం

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 14వ తేదీ దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు ఉన్నవారు ఉపయోగించుకుని వ్యాజ్యాలు పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని, కోర్టుల్లో చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందవచ్చన్నారు. ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి



ప్రభుత్వ వైద్యశాలలో నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చేవారు, వారి సహాయకులు ఎవరెవరో వచ్చి పోతుంటారు. ఎవరు వస్తున్నారో, ఎందుకు వస్తున్నారో తెలియని పరిస్థితి. ముఖ్యంగా క్యాజువాలిటీ, ప్రసూతి వార్డు, ఐసీయూ దగ్గర ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటుంది. రాత్రి పూట ఒక అంతస్తు నుంచి మరొక అంతస్తులోకి వెళ్లాలంటే భయపడే వాతావరణం ఉంటుంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి పూట పోలీసు పెట్రోలింగ్ పెంచాలి. హాస్పిటల్ మెయిన్ గేటు వద్ద పటిష్టమైన సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.

– జి.ఉషాదేవి, స్టాఫ్‌నర్స్, జీజీహెచ్, ఒంగోలు



సమాజంలో విజృంభిస్తున్న ప్రాణాంతక వ్యాధులను ఆధునిక వైద్యంతో తిప్పికొడుతూ.. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగులను కాపాడుతూ.. ప్రాణదాతలుగా నిలుస్తున్న వైద్యులకు కనీస రక్షణ కరువైంది. ఆస్పత్రుల్లో తరచూ చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలు, అఘాయిత్యాలు డాక్టర్ల ఆత్మస్థైర్యాన్నే దెబ్బతీసేలా మారడం ఆందోళన కలిగించే విషయం. వారి రక్షణ కోసమంటూ ప్రభుత్వాలు చేసిన చట్టాలు చట్టుబండలయ్యాయి. కోల్‌కతాలోని ఆర్.జి.కార్ ఆస్పత్రి ఘటన వైద్యుల మనోభావాలను మరింత కుంగదీసింది. వీటికితోటు ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిర్భయంగా పనిచేసేలా సురక్షిత పరిసరాలు, మెరుగైన భద్రత కోసం వైద్యులు తరుచూ గళం విప్పుతున్నా వారి మొర ఆలకించే నాథుడే లేరు. ప్రాణాలు నిలుపుతున్న డాక్టర్ దేవుళ్లకు అందరం అండగా నిలుద్దాం..

దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి



దేశంలో ఏదైనా ఘటన జరిగినప్పుడు కొంత హడావుడి చేసి కొన్ని చర్యలు తీసుకుంటారు. ఆ తరువాత వాటిని వదిలేయడం వల్లనే కోల్‌కత్తా లాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి. దీనికి పరిష్కారం ఆలోచించాలి. నిపుణులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించాలి. ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలి. అందుకే మేము సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేయమని కోరుతున్నాం. అన్నీ రకాల రక్షణ చర్యలు తీసుకోవాలి.

– డా.శ్రావ్య, పీజీ, ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలు.



తర్లుపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి, పక్కన అధికారులు



సచివాలయ ఉద్యోగిని, ఎంపీడీఓతో వాదులాడుతున్న టీడీపీ నాయకులు



మురారిపల్లెలో గ్రామ సభను బహిష్కరించిన సర్పంచ్ జయమ్మ, రైతులు

తమ్ముళ్లకే ఉపాధి!

- ముందుగానే 'మిగులు' పనులకు ప్లాన్
- జనం ముందు గ్రామసభలతో కలరింగ్
- మేము చెప్పినట్లు చేయండంటూ అధికారులపై టీడీపీ నేతల జులుం
- హెచ్చరికలు..దూషణలతో ఉపాధి గ్రామసభలు
- మేం సూచించిన పనులే చేయాలని హుకుం
- సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులపై దూషణలు
- అధికార దర్పం ప్రదర్శించిన టీడీపీ నేతలు
- కంభంలో కంటతడి పెట్టిన సచివాలయ సిబ్బంది
- మురారిపల్లెలో గ్రామ సభను బహిష్కరించిన సర్పంచ్
- టీడీపీ నేతలతో నిండిపోయిన సభలు
- రసాభాసగా మారిన పలు గ్రామసభలు

ఒంగోలు సిటీ: ఉపాధి నిధులపై పచ్చ నాయకులు కన్నేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనవరమైన పనుల గుర్తింపు పేరుతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలన్నీ టీడీపీ నేతలతో నిండిపోయాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులకు సంబంధించి ఎక్కడెక్కడ చేయాలో ముందుగానే సిద్ధం చేసుకుని గ్రామసభల్లో ప్రజల సమక్షంలో గుర్తించినట్లు కలరింగ్ ఇచ్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం టీడీపీ నాయకులకు పనులను కట్టబెట్టేందుకే వీటిని నిర్వహిస్తున్నారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు సభల్లో తెలుగుదేశం పార్టీ నేతలు దాదాగిరిని ప్రదర్శించారు. మేం చెప్పినట్టే వినాలంటూ అధికారులపై జులుం ప్రదర్శించారు. టీడీపీ నాయకులు వ్యవహరించిన తీరుపై సచివాలయం మహిళా ఉద్యోగి కంటతడి పెట్టింది. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నేతలు ఒకరిమీద మరొకరు ఆధిపత్యం కోసం గొడవలు పడ్డారు. మొత్తంగా జిల్లాలోని తొలి రోజు నిర్వహించిన పలు సభలు రసాభాసగా మారాయి.

సచివాలయ సిబ్బందికి వార్నింగ్

తర్లుపాడు: మండలంలో నిర్వహించిన గ్రామ సభలు రాజకీయ పార్టీ కార్యక్రమంలా మారాయి. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా పనులను గుర్తించి, వాటిని గ్రామ సభల్లో ఆమోదించాల్సింది పోయి అధికారులపై జులుం ప్రదర్శించారు. పలు పంచాయతీల్లో స్టేజీపైకి ఎక్కి కూర్చునేందుకు పోటీలు పడ్డారు. అంతటితో ఆగక మైకులకు పనిచెప్పారు. మీటింగు ఉద్దేశాలను పక్కనపెట్టి సచివాలయ సిబ్బంది, అధికారులపై చిందులు తొక్కారు. తాను చెప్పినట్టు వినకపోతే ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఎక్కడికైనా వెళ్లిపోవాలని గ్రామసభ సాక్షిగా తర్లుపాడులో ఓ టీడీపీ నాయకుడు సచివాలయ సిబ్బందికి బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చాడు. తమను గౌరవించడం లేదని, తన మాట లెక్కచేయడం లేదని ఆయన వారిపై విరుచుకుపడ్డాడు. ఇక్కడ పనిచేయాలంటే తాను చెప్పిన విధంగా చేస్తేనే ఉండాలని హుకుం జారీ చేశారు. దీంతో సభకు వచ్చిన అధికారులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.



రసాభాసగా మారిన కంభం గ్రామసభ

గ్రామ సభను బహిష్కరించిన సర్పంచ్

యర్రగొండపాలెం: అర్హత లేని వ్యక్తులను అధికారులు వేదికపై పిలిచి అవమానపరిచారని సర్పంచ్ గ్రామ సభను బహిష్కరించిన సంఘటన మండలంలోని మురారిపల్లెలో జరిగింది. శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సభలో ముందుగా సర్పంచ్ ఏకుల జయమ్మ ముసలారెడ్డిని వేదికపైకి అధికారులు ఆహ్వానించారు. వెంటనే ఆ గ్రామంలోని టీడీపీ వర్గీయులను పిలిచి ఆమె పక్కనే కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అర్హత లేని వ్యక్తులను వేదికపైకి పిలవడం ఏంటని ఆమె అధికారులను ప్రశ్నించినా తగిన సమాధానం వారు ఇవ్వలేకపోవడంతో సర్పంచ్ జయమ్మ గ్రామ సభను బహిష్కరించి బయటికి వచ్చారు. ఆమె వెంట ఆ గ్రామానికి చెందిన రైతులు కూడా బయటికి రావడంతో గ్రామ సభ అర్థంతరంగా ముగించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీటీసీ, వార్డు సభ్యులను గౌరవంగా గ్రామ సభకు ఆహ్వానించకుండా ఎటువంటి హోదాలేని అధికార పార్టీ వర్గీయులను అధికారులు పిలవడం సరైన పద్ధతి కాదని అన్నారు.

మేము సూచించిన పనులే చేయాలి

కురిచేడు: ఉపాధి హామీ పథకంలో మేము సూచించిన పనులే చేయాలి, పాతవి మంజూరైనా సరే వాటిని ఆపాల్సిందే అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు గ్రామసభలో అల్టిమేటం జారీ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సమావేశానికి హాజరైన కూటమి నాయకులు మాట్లాడుతూ మంజూరైన పాతపనులు చేస్తే ఒప్పుకోమని తేల్చి చెప్పారు. మండలానికి మంజూరైన రూ.1.30 కోట్ల పనులకు సంబంధించి రూ.70 లక్షలకు సిమెంటు రోడ్లు, రూ.60 లక్షలకు డ్రైనేజీలు మంజూరు చేయాలని వారు సూచించినా ఆ పనులు ఎందుకు మంజూరు చేయలేదని నిలదీశారు. కావాల్సిన పనులు రాసిస్తే వాటిని తీర్మానం పుస్తకంలో రాసి ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే కొద్దీ వాటిని మంజూరు చేయించి పనులు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని పంచాయతీ కార్యదర్శి చాంద్‌బి వారికి వివరించారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పూర్తి చేద్దామని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభల్లో అధికారులు ప్రొటోకాల్ మరిచారు. సర్పంచ్‌ల భాగస్వామ్యంతో గ్రామాల్లో పనులు గుర్తించి వాటిని సభలో ఆమోదం తెలిపేలా ఉత్తర్వులు ఉన్నా మండలంలోని కొన్ని చోట్ల ప్రొటోకాల్ పాటించలేదు.

కంభంలో రసాభాస

కంభం: "మేం మాట్లాడేటప్పుడు నువ్వు కూర్చో, మర్యాద ఇచ్చినప్పుడు నువ్వు కాపాడుకో" అంటూ దళిత సర్పంచ్ పై టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ప్రజలు, అధికారులు పాల్గొన్న సభలో నానా దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగారు. దీంతో కంభంలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సభ జరుగుతున్న సమయంలో టీడీపీ నాయకుడు అనీస్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదంటూ పరుష పదజాలంతో దూషించడంతో అక్కడే ఉన్న ఉపసర్పంచ్ సయ్యద్ ఖాసిం అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి చేస్తామంటే చెయ్యండి మేము కూడా సహకరిస్తాం, అంతే కానీ మీఇష్టం వచ్చినట్లు మాట్లాడం సరికాదని హితవుపలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంభం పంచాయతీ పరిధిలోని అర్బన్‌కాలనీ అభివృద్ధికి రూ.కోటి ఇరవై లక్షలు కేటాయించిందని తెలిపారు. అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ ప్రభుత్వంలో ఏం అభివృద్ధి జరిగిందో గుర్తుచేసుకోవాలన్నారు. సర్పంచ్ పల్నాటి బోడయ్య జోక్యం చేసుకుని గ్రామసభలో కేవలం అభివృద్ధి పనుల గురించి మాట్లాడండి ఇతర విషయాలు వద్దు లేకుంటే సభను ముగించేస్తామని స్పష్టం చేశారు. దీంతో టీడీపీ నాయకులు సర్పంచ్‌పైనా ఎదురుతిరిగారు. మూకుమ్మడిగా వాగ్వివాదానికి దిగారు. సమావేశంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గంగారపు ఓబయ్య టీడీపీ నేతల తీరును ఖండించారు.

కంటతడి పెట్టిన సచివాలయ ఉద్యోగిని

సచివాలయం పరిధిలో గుర్తించిన పనుల వివరాలను కంభం–3 సచివాలయ ఉద్యోగిని చదువుతున్న సమయంలో టీడీపీ నాయకులు అడ్డుతగిలారు. ఎవరిని అడిగి పనులు గుర్తించారు... మాకు చెప్పాలి కదా అని ఆమెతో గొడవకు దిగారు. టీడీపీ నాయకులందరూ ఒక్క సారిగా ఆమెపై విరుచుకుపడడంతో సమాధానం చెప్పలేక సదరు ఉద్యోగిని తోటి సిబ్బంది వద్దకు వెళ్లి కూర్చొని కంటతడి పెట్టుకుంది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం చెప్పిన పనులు శాంక్షన్‌కు పంపించినవి కావని గ్రామంలో గుర్తించిన పనులు చెబుతున్నామని, ఇంకా ఏవైనా ఉంటే వాటిని నమోదు చేసుకొని చివరగా అవసరమైన వాటికి ప్రాధాన్యత ఇచ్చి మంజూరు చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ స్థలంలో గ్రామసభ

కొండపి మండలం పెద్దకల్లగుంట గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ ప్రైవేటు స్థలంతో నిర్వహించారు. ప్రభుత్వానికి సంబంధించిన గ్రామ సచివాలయాల్లో, వివిధ ప్రభుత్వాల కార్యాలయాలకు చెందిన ప్రదేశాల్లో గ్రామసభ నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద కల్లగుంట గ్రామంలో ప్రైవేట్ వ్యక్తుల స్థలాల్లో గ్రామసభ నిర్వహించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. గ్రామసభను అక్కడ నిర్వహించడం వలన ఒక వర్గానికి సంబంధించిన గ్రామ ప్రజలు అక్కడికి వెళ్లడానికి నిరాకరించారని తెలిసింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా కమ్యూనిటీ హాల్లో స్థలం సరిపోకపోవడంతో ఈ స్థలాన్ని వాడుకున్నట్లు చెప్పారు.



మహిళల భద్రతకు కఠిన చట్టాలుండాలి

- వైద్యురాలి హత్యాచార ఘటనపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఒంగోలు: కోల్‌కతా ఆర్‌జీకార్ ఆస్పత్రిలో ఇటీవల ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై ఒంగోలులోని న్యాయవాదులు ముక్తకంఠంతో నిరసన వెలిబుచ్చారు. జిల్లా కోర్టు వద్ద నుంచి బయల్దేరిన ఈ ర్యాలీ ప్రకాశం భవనం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, మహిళల భద్రతకు కఠిన చట్టాలను అమలుచేయాలన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని నినదించారు. కార్యక్రమంలో ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, ఏల్చూరి సురేంద్రబాబు, పాదర్తి ఆదిశేషు, గోపాలరావు, ఎంకేకే ప్రసాద్, బొడ్డు భాస్కరరావు, గోకనకొండ శ్రీనివాసరావు, అయినాబత్తిన సుబ్బారావు, పర్చూరి బాబ్జీ, కుంచాల రాజేంద్ర, ఎండీ యాసిన్, సులోచన, ఇందిర, జ్యోతి, సుజాత, సరళ తదితరులు పాల్గొన్నారు.

జూడాల సమ్మె విరమణ

ఒంగోలు టౌన్: కోల్‌కత్తాలోని ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా విధులు బహిష్కరించి ఉద్యమ బాట పట్టిన జూనియర్ డాక్టర్లు శుక్రవారం సమ్మె విరమించారు. రెండు వారాలుగా వివిధ రూపాల్లో చేపట్టిన నిరసనలను, దీక్షలను విరమించి విధుల్లో చేరినట్లు జూడా ప్రసిడెంట్ డా.అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇది కేవలం పోరాట విరమణ మాత్రమేనని, తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తిరిగి ఉద్యమం చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వైద్యులపై జరుగుతున్న దాడులను, వైద్యశాలల విధ్వంసాన్ని నియంత్రించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలన్న తమ దీర్ఘకాలిక డిమాండ్ పట్ల ఇప్పటికైనా సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్థానికంగా కూడా ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి తీసుకున్న చర్యల పట్ల సంతృప్తి చెందినట్లు తెలిపారు. అయితే తాత్కాలిక చర్యలుగా మిగిలిపోకూడదని కోరుకుంటున్నామన్నారు.

పాడైన చిక్కీలు.. కొట్టేసిన రికార్డులు

- లింగంగుంట జెడ్పీ హైస్కూల్లో ఎక్స్‌పైర్డ్ డేట్ అయిపోయిన చిక్కీలు
- మధ్యాహ్న భోజనం రికార్డుల్లో కొట్టివేతలు
- తనిఖీలో బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి ఆగ్రహం



లింగంగుంట పాఠశాలలో చిక్కీలను పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

మద్దిపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, చిక్కీలు, రాగి పిండి తదితర విషయాలను పరిశీలించారు. చిక్కీలు ఎక్స్‌పైర్డ్ డేట్ అయిపోయి ఉండడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో పాఠశాలలో వెనుక వైపు ఉన్న టాయిలెట్స్ వెళ్లేందుకు పాములు తిరుగుతున్నాయని గుర్తించారు. దీని విషయమై ఇన్‌చార్జిని ప్రశ్నించగా ఆయన రెండు రోజుల్లో పాఠశాలలో పూర్తిగా శుభ్రం చేయిస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజనం రిజిస్టరు పరిశీలించి స్టాకును తనిఖీ చేశారు. రికార్డు మొత్తం కొట్టివేతలు వైట్నర్ పూయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త ఉండడం మట్టితో నిండి ఉండడం గమనించి ఉపాధ్యాయులను పిలిచి హెచ్చరించారు. విద్యార్థులకు అవసరమైన మేరకు నీరు అందడం లేదని పలువురు విద్యార్థులు ఆమెకు తెలిపారు. దీంతో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుని పిలిచి నీరు సక్రమంలో అందేలా చూడాలని, పాఠశాలలో కంప్లెయింట్ బాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మార్గమధ్యంలో ఒంగోలు రూరల్ పరిధిలోని మండువవారిపాలెం అంబేడ్కర్ నగర్లో ఉన్న అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లగా అక్కడ విద్యార్థులు ఒక్కరు కూడా లేరు. అంగన్‌వాడీ వర్కర్ సెంటర్‌ను మూసి వేసే క్రమంలో కమిషన్ మెంబర్ అక్కడకు చేరుకుని రికార్డులు చూపాలని అడగడంతో ఆమె చూపకుండా దాదాపు గంట పైగా సతాయించడంతో వెంటనే ఐసీడీఎస్ పీడీ ఫణి రాజకుమారికి ఫోన్ చేసి సెంటర్ పరిస్థితిని వివరించారు. అంగన్‌వాడీ సెంటర్లో ఉన్న లోపాలు తెలిపి సదరు అంగన్‌వాడీ వర్కర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అనంతరం ఆమె త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి బాలల విషయంలో ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఒంగోలు ఎంఈఓ సరస్వతి, సోషల్ వర్కర వీరాంజనేయులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఒంగోలు: సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను ఈనెల 25న మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన బాలబాలికల జట్లు సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. 2009 జనవరి 2వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే ఎంపిక పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9010613146, 9849429839ను సంప్రదించాలని సూచించారు.

హౌస్ వైరింగ్‌లో శిక్షణ

టంగుటూరు: ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 30 రోజుల పాటు పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండి 19 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. పేర్ల నమోదు, ఇతర వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి

గిద్దలూరు రూరల్: రైలు కింద పడి గుర్తుతెలియని ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం గిద్దలూరు పట్టణ శివారులో ఆర్మీ క్యాంటీన్ సమీపంలో చోటుచేసుకుంది. సుమారు 55 ఏళ్ల వయసున్న మహిళ గిద్దలూరు నుంచి గుంటూరు వైపు వెళ్లే గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు నంద్యాల జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. కాగా, మృతురాలి శరీరంపై నీలం రంగు చీర ఉంది. ఆమె వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. వివరాల కోసం నంద్యాల రైల్వే ఎస్సై 9441509497ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- ద్విచక్రవాహనాని ఢీకొట్టి వెళ్ళిపోయిన బొలెరో వాహనం


చికిత్సపొందుతున్న క్షతగాత్రుడు

కంభం: ద్విచక్రవాహనాన్ని బులెరో వాహనం ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలైన సంఘటన అనంతపురం–అమరావతి హైవేపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గిద్దలూరు మండలం వెల్లుపల్లి గ్రామానికి చెందిన గోగు నవీన్ గిద్దలూరు నుంచి మార్కాపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కంభం–జంగంగుంట్ల మధ్యలో హైవేపై ఓ బులెరో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జవగా ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- ఏపీజీబీ ఆర్ఎం రఘురామ్


బహుమతులిస్తున్న ఆర్ఎం రఘురామ్


మార్కాపురం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, ఖాతాదారులు సేవలను వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రఘురామ్ అన్నారు. మార్కాపురం ప్రాంతీయ కార్యాలయంలో పనిచేసే ఏపీజీబీ బిజినెస్ కరస్పాండెంట్ల సమావేశం శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. సమావేశంలో బిజినెస్ కరస్పాండెంట్ల పనితీరును సమీక్షించారు. సందర్భంగా ఆర్ఎం రఘురామ్ మాట్లాడుతూ బ్యాంకు పురోభివృద్ధికి బిజినెస్ కరస్పాండెంట్ల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఏపీజీబీలో ఖాతాదారులకు అందిస్తున్న వివిధ డిపాజిట్ పథకాలు, రుణ సౌకర్యాలు, సామాజిక భద్రతా స్కీముల గురించి వివరించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కంటే ఎక్కువగా ప్రగతి కుబేర్ పథకం ద్వారా 444 రోజులకు అధిక వడ్డీ 8.30% శాతం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, డీజీ ఖాతా, క్యూఆర్ కోడ్స్ యూపీఐ, వాట్సప్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలను కలుగచేస్తున్నామన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకూ మంచి పనితీరు కనబరిచిన బ్యాంకు ఉద్యోగులకు అవార్డులు అందిస్తారన్నారు. హెడ్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ రసూల్ సాహెబ్, రీజినల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ భువనేశ్వర్, బిజినెస్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



వైద్యులపై దాడి ఆలోచనే రాకూడదు

వైద్యుల మీద, ముఖ్యంగా మహిళా వైద్యుల మీద దాడులకు పాల్పడటం అనేది దారుణం. ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు పోసే వైద్యుల మీద దాడులు చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించాలి. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. తరచుగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇది మంచి పరిణామం కాదు. ఇలాంటి చర్యల వల్ల వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెనకాడే పరిస్థితులు ఏర్పడతాయి. ఇది చివరికి రోగులకు నష్టం కలిగిస్తుంది. కనుక ప్రజలు కూడా ఇలాంటి దాడులను ఖండించాలి.

– డా.దుర్గాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, ఒంగోలు





మెరుగైన వసతులు కల్పించాలి

వందలాది మంది స్టాఫ్ నర్సులు, మహిళా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే మహిళా సిబ్బందికి సరైన మౌలిక వసతులు లేవు. ఇంటి నుంచి డ్యూటీకి వచ్చిన తరువాత దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు లేవు. ఒకటీఅరా ఉన్నా వాటిని స్టోర్ రూంలుగా వాడుతుండటంతో చాలా ఇబ్బందిగా ఉంటోంది. వాష్ రూంలు లేకపోవడం మరీ సమస్యగా తయారైంది. అసౌకర్యాలు, అభద్రత మధ్య మహిళలు పని చేయడం ఎలా సాధ్యం. మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుకుంటున్నాం.

– బి.కమల కుమారి, స్టాఫ్ నర్స్, జీజీహెచ్, ఒంగోలు


బురదమయమైన జీజీహెచ్ ప్రవేశ ద్వారం-2


నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉన్న జీజీహెచ్ పరిసరాలు

సమస్యల రొద.. రోగుల వ్యథ

అపరిశుభ్రంగా మార్కాపురం జీజీహెచ్ ప్రాంగణం

- చినుకుపడితే చిత్తడే.. బురదలో అడుగుతీసి అడుగేయడం కష్టమే..
- అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల వినతి

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురంలోని జీజీహెచ్‌లో సమస్యలు రోగులను వెక్కిరిస్తున్నాయి. చినుకు పడితే ఆస్పత్రి ప్రాంగణం బురదమయం అవుతుండటంతోపాటు పారిశుధ్యం లోపించడంతో రోగులతోపాటు వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే అభివృద్ధి పనులపై దృష్టి సారించి మౌలిక వసతుల కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని పశ్చిమ ప్రకాశం వాసులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జీజీహెచ్‌గా రూపాంతరం చెందిన మార్కాపురం జిల్లా వైద్యశాలను సమస్యలు చుట్టుముట్టాయి. రోజూ పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల నుంచి సుమారు 400 నుంచి 500 మంది వరకు వస్తుంటారు. కంభం, బేస్తవారపేట, గిద్దలూరు వైపు నుంచి వచ్చే రోగులు సాధారణంగా పూర్వపు గేటు దగ్గర దిగుతారు. ఈ రహదారి ఛిద్రమైపోయింది. వర్షం కురిస్తే అడుగులో అడుగేసుకుంటూ నడవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బురదలో పడిపోవడం ఖాయం. ఇక పోస్టుమార్టం గది పరిసరాలు, వైద్యశాల వెనుక భాగం, వీఆర్‌డీఎల్ ల్యాబ్ ప్రాంతం, బ్లడ్ బ్యాంకుకు వెళ్లే అంతర్గత రహదారి వర్షం పడితే బురదమయంగా మారుతోంది.


దుర్వాసన వస్తున్న డ్రైయినేజీ

అభివృద్ధిని కొనసాగించాలి

మార్కాపురం సమీపంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతోపాటు జీజీహెచ్ అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. పశ్చిమ ప్రకాశం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, పేదలకు ఆర్థిక భారం తగ్గించే దిశగా గత ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రశంసలందుకున్నాయి. గత ప్రభుత్వంలో జీజీహెచ్‌లో రూ.8 కోట్లు ఖర్చు చేసి 100 పడకలను 450కి పెంచారు. అలాగే 9 మంది డాక్టర్లే పనిచేస్తున్న ఈ ఆస్పత్రిలో 73 మందిని అదనంగా నియమించి రోగులకు మెరుగైన సేవలు అందించారు. అలాగే రూ.40 లక్షలతో వృద్ధులకు వెయిటింగ్ హాల్ నిర్మించడంతోపాటు ఈసీజీ, వెంటిలేటర్లు, కిడ్నీ పరీక్షల యంత్రం, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రిని మరింత సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రభుత్వం మారిపోవడంతో అభివృద్ధి పనులకు స్వల్ప ఆటంకం ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో గడిచిన ఐదారు నెలలుగా ఆస్పత్రిలో అభివృద్ధి పనులపై అధికారులు సైతం పెద్దగా దృష్టి సారించలేదు. కలెక్టర్‌తోపాటు వైద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో డ్రైనేజీ, అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


ఆస్పత్రి ఆవరణలో నిలిచిన మురుగు

డ్రెయినేజీ లేకనే సమస్య

డ్రెయినేజీ వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. కొద్ది రోజులకే ఆ నీరు మురుగుమయమై దోమల వ్యాప్తికి కారణమవుతోంది. రోగుల సహాయకులు కూర్చునే బెంచిల వద్ద వర్షం నీరు నిల్వ చేరడం, ఆస్పత్రి వ్యర్థాలు ఆవరణలోనే పడేస్తుండటంతో డంపింగ్ యార్డులా మారుతోంది.

సాధారణ కాన్పులు ప్రోత్సహించడమే లక్ష్యం

- ఇంటర్నేషనల్ మిడ్‌వైఫరీ ఫౌండేషన్ ప్రతినిధులు
- జీజీహెచ్‌లో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయం


మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవితో మిడ్‌వైఫరీ ఎడ్యుకేటర్స్, యూనిసెఫ్ బృందం

ఒంగోలు టౌన్: సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించి సాధారణ కాన్పులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇంటర్నేషనల్ మిడ్‌వైఫరీ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల, జీజీహెచ్‌ను సందర్శించారు. యూనిసెఫ్, ఫెర్నాండేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దేశంలో గర్భిణులకు అవగాహన, వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా సర్వజన ఆస్పత్రిలో మహిళలకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను పరిశీలించారు. గర్భిణుల ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించడం, పెరిగిపోయిన సిజేరియన్లను తగ్గించడం గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, నర్సింగ్ సూపరెండెంట్ బి.సంపూర్ణమ్మ, అబ్‌స్ట్రెక్ గైనకాలజీ విభాగం హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో చర్చించారు. ప్రసూతి వార్డు, గర్భిణుల వార్డులో ఉన్న నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ స్టేట్ మెటర్నల్ హెల్త్ కన్సల్టెంట్ నాగేంద్ర గవ్వల, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ షీ సేఫ్ లీడర్ నీనా దొండపాటి, ఇంటర్నేషనల్ మిడ్‌వైఫరీ ఎడ్యుకేటర్లు అడెలా హామిల్టన్, లూసీ ఫ్లోరీస్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి


సీఎస్‌పురంలో గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

సీఎస్‌పురం (పామూరు): సమస్యలు లేని, అభివృద్ధి చెందిన పంచాయతీల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, అందుకోసమే రికార్డు స్థాయిలో ఒకే రోజు రాష్ట్రంలో 13326 గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. సీఎస్‌పురంలో శుక్రవారం సర్పంచ్ శ్రీరామ పద్మావతి అధ్యక్షతన ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, కాల్వల నిర్మాణం చేపట్టి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీరు, అంతర్గతరోడ్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సమస్యను అధిగమిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం డివిజన్, మండల స్థాయిలో మీకోసం నిర్వహిస్తామని చెప్పారు. సీఎస్‌పురంలో టాయిలెట్స్ నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ కళాశాల నిర్మాణం చేపడతామని తెలిపారు. గ్రామసభలో రూ.4.65 కోట్ల ఉపాధి హామీ పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, డీపీఓ ఉషారాణి, జెడ్పీ సీఈఓ మాధురి, ఆర్డీఓ జాన్ ఇర్విన్, మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీఓ రామచంద్రరావు, ఏపీడీ ఏపీఓ వాక్యవతి, ఏపీఎం విద్యాసాగర్, బోయళ్ల నారాయణరెడ్డి, పీఎస్ రాంప్రసాద్, జి.వాణి, బొమ్మనబోయిన వెంగయ్య, బొబ్బూరి రమేష్, ఎస్.సి.మాలకొండయ్య, ఏఓ రాధ, చావా చంద్రశేఖర్, డాక్టర్ హోమద్యుతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం


టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


డీపీఓలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కలెక్టరేట్‌లో టంగుటూరి విగ్రహానికి ఘన నివాళి

ఒంగోలు అర్బన్: స్వాతంత్య్ర పోరాటంతోపాటు రాష్ట్ర అభివృద్ధిలోనూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుది ప్రత్యేక స్థానమని ఆయన పోషించిన పాత్ర మరువలేనిదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం టంగుటూరి జయంతిని పురస్కరించుకుని ప్రకాశం భవనం ప్రాంగణంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. ప్రకాశం పంతులు మునిమనవడు టంగుటూరి సంతోష్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు తన సంపాదనను దేశం కోసం వెచ్చించిన త్యాగమూర్తి అని కీర్తించారు. గో బ్యాక్ సైమన్ కమిషన్, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహాల్లో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. యువత ప్రకాశం పంతులును స్ఫూర్తిగా తీసుకుని ధైర్యంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, మేయర్ సుజాత, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీఓ సుబ్బారెడ్డి కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో..

ఒంగోలు టౌన్: కుగ్రామంలో పుట్టి పెరిగి రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి చరిత్ర సృష్టించిన ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శనీయుడని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర పోరాటంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా స్వాతంత్య్రానంతరం తొలి ముఖ్యమంత్రిగా నిజాయితీగా పనిచేశారని కొనియాడారు. ఆయన తెలుగు జాతికి చేసిన సేవలకు గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లాకు ప్రకాశం జిల్లాగా నామకరణం చేశారని తెలిపారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, ఆయన ఆశయసాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఓ సారూ.. ఇస్తారా తాగునీరు

- నీటి కోసం రోడ్డెక్కిన పోతంపల్లె ఎస్సీ కాలనీవాసులు


గంగుపల్లి గ్రామం వెళ్లే తారురోడుపై బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్దారవీడు: మండలంలోని రేగుమానిపల్లె పంచాయతీ పోతంపల్లి ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు నెలల నుంచి కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులకు చెప్పినా సమస్య పరిష్కరించలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో వంద కుటుంబాలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాలనీలో రెండు సింగిల్ ఫేజ్ మోటార్లు ఉన్నాయి. బోర్ల నుంచి అరకొర నీరు రావడంతో ట్యాంక్ వద్ద బిందె నీటి కోసం గంటల తరబడి నిలబడి నీటిని పట్టుకుంటున్నామని మహిళలు చెబుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా కొంత మేర నీటి సమస్య తీరేదని అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభకు మండల స్థాయి అధికారులు శుక్రవారం హాజరవుతారని తెలుసుకున్న ఎస్సీ కాలనీ ప్రజలు తారురోడ్డుపై బిందెలతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు ముందుగానే గ్రామంలో గ్రామసభ తూతూ మంత్రంగా నిర్వహించుకొని వెళ్లారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.